ఇన్వెస్టర్స్ మీట్‌లో మాట్లాడుతున్న ప్రతినిధులు

స్టీల్‌ప్లాంట్ ఆస్తుల విక్రయం కోసం.. ఆర్ఐఎన్ఎల్ ఇన్వెస్టర్స్ మీట్

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో : వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ఆస్తుల విక్రయానికిగాను నేషనల్ బిల్డింగ్స్ కనస్ట్రక్షన్ కార్పొరేషన్ (ఎన్‌బిసిసి), రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ (ఆర్ఐఎన్ఎల్), నేషనల్ ల్యాండ్ మానిటైజేషన్ కార్పొరేషన్ (ఎన్ఎల్ఎమ్‌సి) సంయుక్త పెట్టుబడిదారుల సదస్సు మంగళవారం ఉదయం నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో జరిగింది. స్టీల్‌ప్లాంట్ యాజమాన్యంలోని ల్యాండ్ పార్శిల్ బ్లాక్‌లు/ప్లాట్ల ఏకపక్ష అమ్మకం కోసం దీన్ని నిర్వహించారు. ఆర్ఐఎన్ఎల్ హెచ్ఆర్ విభాగం (సిజిఎం) జి.గాంధీ, ఎన్‌బిసిసి (ఇంజినీరింగ్ విభాగం) జిఎం జి.రాజారామ్, ఎన్ఎల్ఎంసి జనరల్ మేనేజర్ రోహిన్ కొప్పురవూరి పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న భవన నిర్మాణ కార్మికులు

భవన నిర్మాణ కార్మికుల నిరసన

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన సంక్షేమ నిధి ఆ రంగం కార్మికులకు గతంలో ఎంతగానో ఉపయోగపడేదని, అటువంటి దానిని వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత నిధులను పూర్తిగా ఖాళీ చేసి నిర్వీర్యం చేసిందని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎం.సుబ్బారావు విమర్శించారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమంలో ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని ఖండిస్తూ మంగళవారం సింగ్ హోటల్ జంక్షన్ వద్ద భవన నిర్మాణ కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణ కార్మికుల సంక్షేమ నిధి నుంచి కార్మికులకు రావలసిన అనేక పథకాలు ప్రస్తుతం అందకుండా పోయాయని అన్నారు. వాటన్నింటినీ పునరుద్ధరించాలని, పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల దరఖాస్తులనూ పరిష్కరించి నిధులు అందివ్వాలని డిమాండ్ చేశారు. ఇసుక మాఫియా పేరు చెప్పి ఇసుకను అందకుండా చేశారని, అలాగే సిమెంట్, ఐరన్, పిక్క ధరలను విపరీతంగా పెంచడంతో నిర్మాణాలు తగ్గి కార్మికులకు ఎటువంటి పనీ లేకుండా పోయిందని చెప్పారు. కరోనా సమయంలో కూడా భవన నిర్మాణ కార్మికులకు సాయం అందలేదన్నారు. సమస్యలను పరిష్కరించకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు జనార్ధనరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు కె.నర్సింగరావు, సిఐటియు జగదాంబ జోన్ కార్యదర్శి చంద్రమౌళి, మత్స్యకారులు, మత్స్య కార్మిక సంఘం నాయకులు కె.చంద్రశేఖర్, భవన నిర్మాణ కార్మికులు శ్రీను, నాయుడు, సిమ్మన్న, పార్వతి, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

నేడు రైతు భరోసా నిధులు జమ

- 2.65 లక్షల మందికి లబ్ధి
- 36,643 మందికి సున్నా వడ్డీ రాయితీ

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

వైఎస్ఆర్ రైతు భరోసా, పిఎం కిసాన్ కింద 2023-24లో మూడో విడత పెట్టుబడి సాయాన్ని, 2021-22లో రబీ, 2022లో ఖరీఫ్‌లో అర్హత పొందిన రైతులకు సున్నా వడ్డీ రాయితీని ప్రభుత్వం బుధవారం విడుదల చేయనుంది. తాడేపల్లి క్యాంప్ ఆఫీసు నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి బటన్ నొక్కి రైతుల ఖాతాలో నిధులు జమచేయనున్నారు. ఈ మేరకు రైతు భరోసా కింద 2,65,886 మందికి, సున్నా వడ్డీ రాయితీ కింద రబీ, ఖరీఫ్‌లో కలిపి 36,643 మంది రైతులకు లబ్ధి చేకూరనుంది. జిల్లా స్థాయిలో జరిగే ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ శాఖ మంత్రి బూడి ముత్యాలనాయుడు, పరిశ్రమల శాఖ మంత్రి అమర్‌నాథ్, కలెక్టర్ రవి పట్టాన్ శెట్టి సహా ఎంపీ, ఎమ్మెల్యేలు పాల్గొననున్నారు. ప్రతి రైతు భరోసా కేంద్రంలో ప్రత్యక్ష ప్రసారం ద్వారా రైతులు చూసేలా ఏర్పాట్లు చేసినట్లు జిల్లా వ్యవసాయాధికారి మోహనరావు తెలిపారు.

అర్హులు ఇలా..

జిల్లాలో పై వాటికి అర్హత కలిగిన రైతులు, కౌలు రైతులు, అటవీ, దేవాదాయ భూములు సాగుచేస్తున్న రైతులు 2,65,886 మంది వున్నారు. వీరికి రైతు భరోసా, పిఎం కిసాన్ కింద రూ.53.32 కోట్లను ప్రభుత్వం జమచేయనుంది. సున్నా వడ్డీ రాయితీ కింద 36,643 మంది రైతులకు రూ.6.90 కోట్లు రైతు ఖాతాలో జమకానున్నాయి. జిల్లాలో సున్నా వడ్డీ రాయితీ కింద 2021-22 రబీలో 18,980 మంది రైతులకు రూ.3.48 కోట్లు, 2022 ఖరీఫ్‌లో 17,663 మంది రైతులకు రూ.3.42 కోట్లు లబ్ధి చేకూరనుంది. రైతు భరోసా, సున్నా వడ్డీ రాయితీ నిధులు జమ చేసే కార్యక్రమానికి బుధవారం సిఎం శ్రీకారం చుట్టినప్పటికీ రైతులందరికీ దశల వారీగా నిధులు జమకానున్నాయి.

నేడు విశాఖకు సిఎం జగన్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డి బుధవారం విశాఖకు రానున్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి అదనపు వ్యక్తిగత కార్యదర్శి కె.నాగేశ్వర్ రెడ్డి మంగళవారం సాయంత్రం ఓ ప్రకటనలో తెలిపారు. ముఖ్యమంత్రి బుధవారం పశ్చిమగోదావరి జిల్లా పర్యటన అనంతరం అక్కడి నుంచి 3:15 గంటలకు ప్రత్యేక హెలీకాప్టర్‌లో బయలుదేరి సాయంత్రం 4:25 బీచ్ రోడ్ లోని కోస్టల్ బ్యాటరీ వద్దకు చేరుకుంటారని అనంతరం 4:35 గంటలకు బీచ్ రోడ్డులోని ఎయు కన్వెన్షన్ సెంటర్‌కు చేరుకుంటారు. అక్కడ డిసిసిబి చైర్మన్, వైసిపి విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు కోలా గురువులు కుమారుని వివాహ వేడుకలో పాల్గొంటారు. అనంతరం 4:55 గంటలకు ఎయు కన్వెన్షన్ సెంటర్ నుంచి బయలుదేరి కోస్టల్ బ్యాటరీ వద్ద ఉన్న హెలీపాడ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి ప్రత్యేక హెలీకాప్టర్‌లో విశాఖపట్నం ఎయిర్‌పోర్టుకు చేరుకొని 5:20 గంటలకు గన్నవరం పయనమవుతారు. ఆయన పర్యటనకు సంబంధించి అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు.

వైసిపి హయాంలో / గ్రామ పంచాయతీలు నిర్వీర్యం

రాజేంద్ర ప్రసాద్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వైసిపి హయాంలో గ్రామ పంచాయతీలు నిర్వీర్యమయ్యాయని ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర అధ్యక్షులు వైవిబి.రాజేంద్రప్రసాద్ అన్నారు. గ్రామ సర్పంచుల అధికారాలను వాలంటీర్ల చేతిలో పెట్టి సర్పంచులను ఉత్సవ విగ్రహాలుగా మార్చి, పంచాయతీలకు నిధులు అందకుండా చేసిన జగన్‌ను వచ్చే ఎన్నికల్లో ఓడించడమే లక్ష్యంగా పనిచేస్తామని తెలిపారు. మంగళవారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న 12 వేలా 918 గ్రామపంచాయతీల్లో 3 కోట్లా 50 లక్షల మంది ప్రజలు ఉన్నారని తెలిపారు. వారందరి కోసం తమ సంఘం గల్లీ నుంచి ఢిల్లీ వరకు ఉద్యమాలు చేస్తోందని తెలిపారు. అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరి విడనాడలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన ఆర్థిక సంఘం నిధులు రూ.6848 కోట్లను ఈ నెలాఖరులోగా గ్రామపంచాయతీలకు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ నిధులను కూడా రాష్ట్ర ప్రభుత్వం పక్కదారి పట్టిస్తోందని తెలిపారు. సుమారు 50 వేల కోట్ల నిధులు ఇవ్వకుండా ప్రభుత్వం దారి మళ్లించిందని అన్నారు. నిధులు లేక, గ్రామాలలో తాగునీరు, కాలువలు, రోడ్లు, వీధిలైట్లు వంటి పనులు చేయలేక సర్పంచులు ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకతను మూటగట్టుకుంటున్నారని, అవమానాన్ని భరిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షురాలు వానపల్లి లక్ష్మి ముత్యాలరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిర్రు ప్రతాపరెడ్డి మాట్లాడుతూ ప్రజల నుంచి ఎన్నికైన సర్పంచులకు గౌరవ వేతనం రూ.3 వేలు ఇస్తుంటే, వాలంటీర్లకు రూ.5 వేలు చెల్లిస్తూ సర్పంచులను అగౌరవపరుస్తున్నారని తెలిపారు. సర్పంచుల గౌరవ వేతనాన్ని పెంచాలని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా అధ్యక్షులు ముత్యాలరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు వేజెళ్ల వినోద్ రాజు పాల్గొన్నారు.

విశాఖలో పరీక్ష రాసేందుకు వచ్చిన మహిళా అభ్యర్థులు

టెట్‌కు 86.80 శాతం మంది హాజరు

ప్రజాశక్తి - ఆరిలోవ : విశాఖ జిల్లాలో మంగళవారం జరిగిన ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)కు 86.80 శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారు. పరీక్ష ప్రశాంతంగా సాగినట్లు జిల్లా విద్యాశాఖాధికారిణి ఎల్.చంద్రకళ తెలిపారు. ఉదయం, మధ్యాహ్నం రెండు పూటలూ జిల్లాలో 7 కేంద్రాల్లో జరిగిన ఈ పరీక్షకు 4420 మంది హాజరుకావల్సి ఉండగా 3,837 మంది హాజరయ్యారు. రాష్ట్రస్థాయి పరిశీలకులు ఏడు కేంద్రాలను, జిల్లా విద్యాశాఖాధికారిణి ఎల్.చంద్రకళ రెండు కేంద్రాలను, ఫ్లయింగ్ స్క్వాడ్స్ రెండు కేంద్రాలను సందర్శించారు. అధికార యంత్రాంగం పటిష్ట ఏర్పాట్లు చేసింది.

16న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జిల్లాలోని అన్ని న్యాయస్థానాల్లో మార్చి 16వ తేదీన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎంవి.శేషమ్మ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. తొలుత మార్చి 9న జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలియజేసినప్పటికీ మహా శివరాత్రి పర్వదినం, వరుసగా ప్రభుత్వ సెలవులు రావడంతో మార్చి 16వ తేదీకి మార్పు చేసినట్లు ఆమె తెలిపారు. కావున కక్షిదారులు ఈ మార్పును గమనించి హాజరుకావాలని కోరారు. జిల్లాలోని న్యాయ స్థానాల్లో పెండింగ్ కేసులు, సివిల్, చెక్ బౌన్స్, బ్యాంకింగ్, మోటార్ ప్రమాదాల నష్ట పరిహారాల కేసులు, సెక్షన్ 138 నెగోషియబుల్ ఇనస్ట్రుమెంట్ చట్టం కేసులు, ఆర్థిక లావాదేవీలు, భూ వ్యవహారాలకు సంబంధించిన కేసులు, కుటుంబ తగాదాలు, కార్మిక, పారిశ్రామిక వివాదాలు లోక్ అదాలత్‌లో పరిష్కారానికి వస్తాయని ఆమె పేర్కొన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు జిల్లా కోర్టు ప్రాంగణంలో ఉన్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో లేదా 0891 - 2560414, 2575046 నెంబర్లలో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

విఎంఆర్‌డిఎ ఛైర్మన్‌గా సనపల చంద్రమౌళి

చంద్రమౌళి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ (విఎంఆర్‌డిఎ) ఛైర్మన్‌గా సనపల చంద్రమౌళి నియమితులయ్యారు. ఈ మేరకు మెట్రోపాలిటన్ రీజియన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీస్ చట్టాన్ని అనుసరించి ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ డిపార్టుమెంట్ ద్వారా ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వై.శ్రీలక్ష్మి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. చంద్రమౌళి విద్యావంతుడు. న్యాయశాస్త్రం, బిజనెస్ మేనేజ్‌మెంట్‌లో మాస్టర్ డిగ్రీ పూర్తి చేసి వ్యాపారవేత్తగా కొనసాగుతున్నారు. రాజకీయాలపై మక్కువతో వైసిపి ఆవిర్భావం నుంచి సేవలు అందిస్తున్నారు. మాధవధార కేంద్రంగా పనిచేస్తూ వస్తున్నారు. వార్డు అధ్యక్షునిగా, ఉత్తర నియోజకవర్గ కన్వీనర్‌గా, రాష్ట్ర కార్యదర్శిగా అందరితో కలిసిమెలిసి పనిచేశారు.

5 నుండి చోడవరం సుగర్స్‌లో క్రషింగ్ నిలుపుదల

ప్రజాశక్తి- చోడవరం : చోడవరం సుగర్ ఫ్యాక్టరీలో మార్చి 5వ తేదీ నుండి క్రషింగ్ నిలుపుదల చేస్తామని ఫ్యాక్టరీ ఎమ్‌డి వి.సన్యాసినాయుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023-24 గానుగాట సీజనుగాను డిసెంబర్ 29న ప్రారంభించగా, ఈ నెల 26వ తేదీ నాటికి 1,38,100 మెట్రిక్ టన్నులు చెరుకు గానుగాడి, 1,13,823 క్వింటాళ్ల పంచదార ఉత్పత్తి చేసినట్లు చెప్పారు. రోజువారి రికవరీ 10.01 రాగా, సరాసరి 9.04గా ఉందని పేర్కొన్నారు. ఏపీ ట్రాన్స్‌కోకు విద్యుత్‌ను 12,16,600 యూనిట్లు ఎగుమతి చేశామన్నారు. పేమెంట్లు 2023 డిసెంబర్ 29 నుండి 2024 జనవరి 15 వరకు రూ.8.72 కోట్లు 4936 మంది చెరకు సరఫరా చేసిన రైతులకు వారి అకౌంట్లో నేరుగా బుధవారం నుండి షెడ్యూల్ ప్రకారం జమచేస్తామని చెప్పారు. రైతులకు ఎప్పటిలాగే విత్తనం, ఒంటికన్ను మొక్కలు వడ్డీ రహిత రుణాలుగా అందిస్తామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం 2024-25 గానుగాటకు గాను మద్దతు ధర 9.5 రికవరీ వున్న ఫ్యాక్టరీలకు టన్ను రూ.3151గా నిర్ణయించడంతో టన్ను ఒక్కింటికి రూ.231 మద్దతు ధర పెరిగిందని పేర్కొన్నారు. ఫ్యాక్టరీ కష్టకాలంలో సహకరించిన రైతులకు, కార్మికులకు మేనేజ్మెంట్ తరుపున కృతజ్ఞతలు తెలిపారు. చెరుకు అత్యధిక దిగుబడి వచ్చే విధంగా ఈ ఏడాది నుండి నుండి రైతులకు పలు సూచనలు, సహకారం అందిస్తామని, వాటిని వినియోగించుకుని, చెరుకు నాట్లు విరివిగా వేసి, ఫ్యాక్టరీ అభివృద్ధికి దోహదపడాలని విజ్ఞప్తి చేశారు.

గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి

ప్రజాశక్తి- కశింకోట : గ్రామాల అభివృద్ధికి అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో కృషి చేయాలని ఎంపీపీ కలగా లక్ష్మి అన్నారు. కసింకోట మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం లక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత సమావేశంలో వచ్చిన సమస్యలను ఏ మేరకు పరిష్కరించారో అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అనకాపల్లి మార్కెట్ కమిటీ ఛైర్మన్ గొల్లవిల్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ రెవెన్యూ శాఖ అధికారుల సక్రమంగా పనిచేయడం లేదన్నారు. మండలంలో ఏ సచివాలయంలో కూడా సిబ్బంది సక్రమంగా ఉండటం లేదని, ఎవరైనా వచ్చి అడిగితే తహశీల్దారు, ఎంపిడిఒ కార్యాలయాలకు వెళ్ళారని చెబుతున్నారని పేర్కొన్నారు. సచివాలయం సిబ్బంది ప్రజలకు అందుబాటులో లేకపోతే సచివాలయాలకు తాళం వేస్తానని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు నమ్మి మీనా గణేష్, పెంటకోట జ్యోతి శ్రీనివాసరావు, ఎంపీడీవో శేషుబాబు, పలువురు సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

ఒపిఎస్‌ను పునరుద్ధరించాలని వినతి

ప్రజాశక్తి-మునగపాక : పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరుతూ యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో మంగళవారం టిడిపి మండల ఇన్‌ఛార్జి దొడ్డి శ్రీనివాసరావు, వైసిపి మండల కన్వీనర్ ఆడారి గణపతి అచ్చినాయుడు, జనసేన మండల ఇన్‌ఛార్జి టెక్కలి పరశు రామ్‌లను కలిసి వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ నాయకులు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో ఆయా పార్టీలు విడుదల చేసే మేనిఫెస్టోలో సిపిఎస్, జిపిఎస్ రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని ఇచ్చే అంశాన్ని చేర్చాలని కోరారు. దీనికి స్పందించిన మండల నాయకులు ఈ అంశాన్ని రాష్ట్ర నాయకత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షురాలు వత్సవాయి శ్రీలక్ష్మి, జిల్లా కార్యదర్శి జిఎస్ ప్రకాష్, రాష్ట్ర కౌన్సిలర్ మారిశెట్టి వెంకట అప్పారావు, ఆశ, జగన్ మోహన్, మార పాల్గొన్నారు.

వినతిపత్రం ఇస్తున్న యుటిఎఫ్ నాయకులు

ఎన్ఎఒబిలో రెండో రోజు కొనసాగిన / ఎల్ అండ్ టి కార్మికుల సమ్మె

విశాఖలో లేబర్ కమిషనర్‌తో చర్చలు

తహశీల్దారు కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న ఎన్ఎఒబిలోని ఎల్ అండ్ టి కార్మికులు

ప్రజాశక్తి-రాంబిల్లి

కనీస వేతనం, పిఎఫ్, బోనస్, ఓటి ఇవ్వాలని కోరుతూ ఎన్ఎఒబిలోని ఎల్ అండ్ టి కార్మికులు చేపట్టిన సమ్మె రెండో రోజు మంగళవారం కూడా కొనసాగింది. ఈ సందర్భంగా తహశీల్దారు కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టిన, రహదారిపై రాస్తారోకో చేశారు. యాజమాన్యం ముందు ఉంచిన 8 డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో మంగళవారం సెంట్రల్ లేబర్ కమిషనర్‌తో ఎల్ అండ్ టి యాజమాన్య ప్రతినిధులు సాయిరామ్, వీరేష్, స్థానిక సీఐ లక్ష్మణరావు, దిశా సీఐ దీనబంధు, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.శంకర్రావు, జిల్లా ఉపాధ్యక్షులు జి.దేవుడునాయుడు, విశాఖ జిల్లా నాయకులు వై.రాజు, ఎల్ అండ్ టి కార్మికుల బృందం విశాఖపట్నం లేబర్ కమిషనర్ సెంట్రల్ ఆఫీస్‌లో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ తమ పరిధిలోని సమస్యలను పరిష్కరిస్తామన్నారు. మిగిలిన సమస్యలపై కేంద్ర ప్రభుత్వం నిబంధనల ప్రకారం ఆన్‌లైన్‌లో సమస్యలపై కంప్లైంట్ చేస్తే, వాటిని చట్ట ప్రకారం పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రాజెక్ట్ డిఫెన్స్ రంగం కనుక ఆందోళనలు విరమించి, విధులకు హాజరు కావాలని సూచించారు. దీనిపై యూనియన్ ప్రతినిధులు కార్మికులతో ఈ విషయమై చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. అనంతరం ఎన్ఎఒబికి వద్ద కార్మికులతో మాట్లాడగా, ఎల్ అండ్ టి యాజమాన్యం గతంలో ఇచ్చిన హామీలు అమలు చేయలేదని, యాజమాన్యం రాతపూర్వకంగా ఇస్తే తప్ప సమ్మె విరమించేది లేదని స్పష్టం చేశారు.

ఎన్నికల సమయంలో నల్లధనం, మద్యంపై నిఘా

జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి

ప్రజాశక్తి-అనకాపల్లి

రానున్న ఎన్నికల్లో నల్లధనం, అక్రమ మద్యం అరికట్టడానికి అవసరమైన నిఘా ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టరు రవి పట్టన్ శెట్టి అధికారులను ఆదేశించారు. తన ఛాంబర్‌లో మంగళవారం ఆయన సంబంధిత అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్ ఎన్నికల ప్రకటన తేదీ నుండి పని చేయడం ప్రారంభించాలన్నారు. ఏదైనా అనుమానాస్పదంగా భారీ మొత్తంలో గమనించినట్లయితే, అవసరమైన చర్య తీసుకోవాలని సూచించారు. రూ.10 లక్షలకు మించిన భారీ మొత్తం గురించిన సమాచారాన్ని ఆదాయపు పన్ను శాఖకు పంపించాలన్నారు. ఈ సమావేశంలో కేంద్ర ఐటి శాఖ ఇన్‌స్పెక్టర్ కెవిఎన్‌టిఆర్.బాబ్జి, జిల్లా ఎక్సైజ్ సూరింటెండెంట్ ఎమ్.సునీత, లీడ్ బ్యాంక్ మేనేజరు సత్యనారాయణ, జిల్లా సహకార అధికారి కిరణ్ కుమారి, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ డి.రామ్మూర్తి, డిటి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

వారంలో సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె చేస్తాం

ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్ల జెఎసి

ప్రజాశక్తి- అనకాపల్లి

గ్రామీణాభివృద్ధి శాఖలో పని చేస్తున్న ఎన్ఆర్ఇజిఎస్ టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు తమ సమస్యలను వారం రోజుల్లోగా పరిష్కరించాలని, లేకుంటే సమ్మె చేస్తామని స్పష్టం చేశారు. ఈ మేరకు రాష్ట్ర జేసీ పిలుపు మేరకు మంళవారం వారు డిఆర్‌డిఒ దయానిధి, పిడి డ్వామా పీడీ సందీప్‌ను వేర్వేరుగా కలిసి వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ జెఎసి నాయకులు మాట్లాడుతూ డిగ్రీ, పీజీ అర్హతతో డీఎస్సీ ద్వారా రోస్టర్ ప్రకారం నియమించబడి, 18 ఏళ్లుగా కష్టపడి పనిచేస్తున్న టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్ల గ్రేడ్‌లు, కేడర్ ఫిక్స్ చేయడంలో తీవ్ర అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. మూల వేతనం రూ.13వేలు మాత్రమే ఇస్తూ శ్రమ దోపిడీ చేస్తున్నారని వాపోయారు. తమకి గ్రేడ్ ఫిక్స్ చేసి, అన్ని ప్రభుత్వ శాఖల్లో అమలు చేసినట్లుగా 23 శాతం పిఆర్‌సి ఉపాధి హామీ సిబ్బందికి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఒప్పంద ఉద్యోగులను ఎఫ్‌టీఈ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు గొర్రెపాటి రవిచంద్ర, దాసరి కొండాజీ, శివానీ, దేవకి, టి.సతీష్ కుమార్, కె.శ్రీనివాసరావు, దశరథ్ రామ్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

కొణతాలను గెలిపించుకుంటాం

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి నియోజకవర్గ టిడిపి, జనసేన ఉమ్మడి అభ్యర్థి కొణతాల రామకృష్ణను అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ధ నాగజదీశ్వరరావు అన్నారు. స్థానిక టిడిపి పార్లమెంట్ కార్యాలయంలో మంగళవారం కొణతాల రామకృష్ణ పరిచయ కార్యక్రమం పట్టణ శాఖ అధ్యక్షులు డాక్టర్ కేకేవిఏ నారాయణరావు అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా నాగ జగదీష్ మాట్లాడుతూ పార్టీ ఆదేశాల ప్రకారం అభ్యర్థి విజయానికి ఇరుపార్టీల నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో కృషి చేయాలని కోరారు. జనసేన అభ్యర్థి కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని రానున్న ఎన్నికల్లో గెలవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు బొలిశెట్టి శ్రీనివాసరావు, కోట్ని రామకృష్ణ, కూండ్రపు రాము నాయుడు, బోడి వెంకటరావు, కుప్పిలి జగన్మోహన్, మల్ల గణేష్, జనసేన నాయకులు మల్ల శ్రీనివాసరావు, శ్రీరామదాసు గోవింద, దూలం గోపి, తాడి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి టికెట్ పీలా గోవిందుకు కేటాయించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి ప్రజలు, కార్యకర్తలు మనోభావాలను గౌరవించి అనకాపల్లి అసెంబ్లీ సీటును టీడీపీ నేత పీలా గోవింద సత్యనారాయణ కేటాయించాలని చంద్రబాబు, పవణ్ కళ్యాణ్‌ను అనకాపల్లి నియోజకవర్గ టీడీపీ శ్రేణులు కోరాయి. ఈ మేరకు పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో పలువురు టిడిపి నేతలు మాట్లాడారు. అనకాపల్లి నియోజకవర్గం టీడీపీకి కంచుకోటని, అటువంటి నియోజకవర్గాన్ని పొత్తులో భాగంగా జనసేనకు కేటయించడం సబబు కాదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కాయల మురళి, కొణతాల శ్రీనివాసరావు, పెంటకోట రాము, కర్రి బాబీ, సిరసపల్లి సన్యాసిరావు, బొద్దపు ప్రసాద్, పోలారపు త్రినాధ్, సబ్బవరపు గణేష్, కొణతాల రత్నకుమారి, నంబారి శ్రీను, ఎంపీటీసీలు కడిమి గణేష్, షేక్ దర్గా పాల్గొన్నారు.

గౌరీశ్వరస్వామి దేవస్థానం హుండీ లెక్కింపు

ప్రజాశక్తి-చోడవరం రూరల్ : స్థానిక శ్రీగౌరీశ్వర స్వామి వారి దేవస్థానం హుండీని మంగళవారం దేవదాయ ధర్మాదాయ శాఖ తనిఖీదారు ఎం.శ్రీధర్ పర్యవేక్షణలో ధర్మకర్తల మండలి సభ్యులు గూనూరు సత్యనారాయణ శివ సమక్షంలో లెక్కించారు. రూ.62,810 ఆదాయం వచ్చిందని ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎస్‌వివి సత్యనారాయణమూర్తి తెలిపారు. కార్యక్రమంలో కొడమంచిలి శ్రీనివాస్, కొడమంచిలి చలపతిరావు, అర్చకులు పాల్గొన్నారు.

మాడుగుల టికెట్ గవిరెడ్డికి ఇవ్వాలి

ప్రజాశక్తి-కోటపాడు : మాడుగుల నియోజకవర్గం తెలుగుదేశం, జనసేన ఉమ్మడి అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు అభ్యర్థిత్వాన్ని ప్రకటించాలని, ఆయన విజయానికి తామంతా కష్టపడి పనిచేస్తామని టిడిపి మండల నాయకులు తీర్మానం చేశారు. టిడిపి తరుపున గవిరెడ్డి రామానాయుడు, పివిజి కుమార్, పైలా ప్రసాదరావు పోటీ చేసేందుకు ఉత్సాహం చూపుతున్న నేపథ్యంలో, టిడిపి మండల పార్టీ ప్రధాన కార్యదర్శి కన్నూరు నాగభూషణం అధ్యక్షతన మంగళవారం కె.కోటపాడు శివాలయం ఎదురుగా ఉన్న మాజీ సర్పంచ్ డోకల లక్ష్మీనరసింహమూర్తి అతిథి గృహంలో కార్యకర్తల అభిప్రాయ సేకరణకు సమావేశం ఏర్పాటు చేశారు. ఇందులో గవిరెడ్డి వర్గానికి చెందిన ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డోకల నరసింహమూర్తి మాట్లాడుతూ ఐదేళ్లుగా వైసిపి నాయకులు టిడిపి కార్యకర్తలను ఇబ్బందులకు గురి చేస్తే కార్యకర్తలకు అండగా నిలబడి భరోసా ఇచ్చిన వ్యక్తి రామానాయుడు అని పేర్కొన్నారు. ఈ సమావేశంలో వంటాకు దేవుడుబాబు, భోజంకి సూర్యనారాయణ, అచ్చిబాబు, పైలా గోపి, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి ఎడ్ల పరుగు పందెం

ప్రజాశక్తి -బుచ్చయపేట : బుచ్చయ్యపేట ఆంజనేయ స్వామి తీర్థం సందర్భంగా మంగళవారం జిల్లాస్థాయి ఎడ్ల పరుగు పందాల పోటీలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుండి అధిక సంఖ్యలో ఎడ్లు పరుగు పందెం పోటీల్లో పాల్గొన్నాయి. తీర్థం సందర్భంగా ఉదయం నుండి ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. వాలీబాల్ పోటీలు, విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. రాత్రికి పలుకు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

విమ్స్‌లో నేడు కేన్సర్ శిబిరం

-ఉచితంగా వైద్య పరీక్షలు, చికిత్స

ప్రజాశక్తి - ఆరిలోవ : విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్)లో బుధవారం కేన్సర్‌పై వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేస్తున్నట్లు డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు తెలిపారు. నోటి, రొమ్ము, గర్భాశయ, జీర్ణకోశ, చర్మ, ఎముకలు, ఊపిరితిత్తులు, అన్నవాహిక కేన్సర్‌ను నిర్ధారించే వైద్య పరీక్షలు చేయనున్నట్లు పేర్కొన్నారు. అవసరమైన వారికి ఉచితంగా వైద్య పరీక్షలు చేయడంతో పాటు మందులు కూడా అందజేయనున్నట్లు వివరించారు. కేన్సర్‌కు సంబంధించిన కిమోథెరపీ, కేన్సర్ సర్జరీలను ఉచితంగా చేయనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1:00 వరకు ఓపీ బ్లాక్‌లో ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

బాలిక భద్రతపై మాట్లాడుతున్న వక్తలు

బాలికల భద్రతపై అవగాహన

ప్రజాశక్తి- పద్మనాభం : మండలంలోని పద్మనాభం కస్తూరిబా పాఠశాలలో బాలికల భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం ఏర్పాటుచేశారు. జిసిడిఒ పిఒ డాక్టర్ కాలేషా బేగం, ఐసిడిఎస్ పిఒ భీమిలి శ్రీదేవి, ఆనందపురం పిఒ నీలిమ బాలికల భద్రతపై వివరించారు. ఆత్మ రక్షణ, లైంగిక దోపిడీ, భావోద్వేగ సమతుల్యత సమస్యలను అధిగమించడానికి ఎలా స్పందించాలో డాక్టర్ కాలేషా బేగం వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ కె.గ్రేస్‌లిల్లీ, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కణమాంలో వైద్యశిబిరం

ప్రజాశక్తి -ఆనందపురం : సొంట్యాంలోని నడింపల్లి సత్యనారాయణ రాజు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యాన కణమాం గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. మెడికవర్, ఎల్‌వి.ప్రసాద్ ఐ హాస్పిటల్ సహకారంతో నిర్వహించిన వైద్య శిబిరంలో 150 మందికిపైగా వైద్యసేవలు అందించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కణమాం సర్పంచ్ అప్పల రాము, సచివాలయ సెక్రటరీ రూప్సి, శంభు ప్రసాద్, రాజ మురగ దాస్, హరగోపాల్, ఆసుపత్రుల సిబ్బంది పాల్గొన్నారు.

29లోగా ట్రేడ్ లైసెన్స్ ఫీజు చెల్లించాలి

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి ఒకటో జోన్ పరిధిలోని 1 నుంచి 4 వార్డుల్లో ఉన్న వ్యాపారులు ఈ నెల 29వ తేదీలోగా డి అండ్ ఒ ట్రేడ్ లైసెన్స్ ఫీజు చెల్లించాలని జోనల్ కమిషనర్ కె.కనకమహాలక్ష్మి పేర్కొన్నారు. నిర్ణీత గడువులోగా చెల్లించకుంటే 25 శాతం అదనపు రుసుం పడుతుందని స్పష్టంచేశారు. సకాలంలో ట్రేడ్ లైసెన్స్ ఫీజు చెల్లించకుంటే కమర్షియల్ ట్యాక్స్ అధికారుల నుంచి పొందిన లైసెన్స్ రద్దుకు సిఫార్సు చేయనున్నట్లు తెలిపారు.

ఎన్నికల విధుల్లో మినహాయింపు

ప్రజాశక్తి- భీమునిపట్నం : ఆరు నెలలోపు ఉద్యోగ విరమణ చేస్తున్న ఉద్యోగులకు ఎన్నికల విధుల నుంచి మినహాయిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయని పిఆర్‌టియు ఉమ్మడి విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.రాజేంద్రప్రసాద్ వర్మ తెలిపారు. 2024 జూన్ నుంచి ఆరు నెలలలోపు ఉద్యోగ విరమణ చేస్తున్న ఉద్యోగులకు ఈ మినహాయింపు వర్తిస్తుందని పేర్కొన్నారు. అవివాహిత మహిళలు, వితంతువులను సమీప నియోజక వర్గాల్లో ఎన్నికల భాధ్యతలు అప్పగించేలా వెసులుబాటు కల్పించాలని కోరినట్లు తెలిపారు.

పల్స్ పోలియోను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి -యంత్రాంగం

ఆనందపురం : మండలంలోని మార్చి 3వ తేదీన చేపట్టే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపిడిఒ ఎస్.అప్పలనాయుడు ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఐదేళ్లలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయాలన్నారు. ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ గంగునాయుడు, ఎంఇఒ పద్మావతి, సిడిపిఒ శ్రీదేవి, సిహెచ్ డాక్టర్ సాంబమూర్తి, కార్యదర్శులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ అప్పలనాయుడు

సమావేశంలో ఆమె మాట్లాడారు. మండలంలోని 22 పంచాయతీల్లో 3292 వైద్య సిబ్బంది తీసుకున్న లక్ష్యాన్ని తప్పనిసరిగా పూర్తిచేయాలని ఆదేశించారు. ఇటుక బట్టీల్లో ఉన్న చిన్నారుల కోసం ప్రత్యేక టీమ్‌ను నియమించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వప్న, మణికుమారి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పద్మనాభం : మండలంలో మార్చి 3వ తేదీన చేపట్టే పల్స్ పోలియోను విజయవంతంచేయాలని పద్మనాభం ఎంపిడిఒ బి.శైలజ కోరారు. పద్మనాభం మండల కాంప్లెక్స్ ప్రాంగణంలో ఉన్న వెలుగు కార్యాలయంలో మంగళవారం అంగన్‌వాడీ, ఎఎన్ఎం, ఆశ వర్కర్లు, సూపర్‌వైజర్లు రేవిడి పిహెచ్‌సి వైద్యాధికారులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు.

'జగనన్న ఇళ్ల స్థలాల్లో దళితులకు అన్యాయం'

ప్రజాశక్తి - ఆనందపురం : ఆనందపురం మండలం వేములవలస పంచాయతీలో దళితులకు జగనన్న ఇళ్ల స్థలాల్లో అన్యాయం జరిగిందని, సమాచార హక్కు చట్టం ద్వారా వివరాలు ఇవ్వాలని కోరుతూ డిప్యూటీ తహశీల్దార్ రాజేష్‌కు మాల మహానాడు రాష్ట్ర వ్యవస్థాపకుడు భాగం గోపాలరావు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గోపాలరావు మాట్లాడుతూ, భీమిలి నియోజకవర్గంలో అనేక పథకాలలో దళితులకు స్థానిక నాయకుల ద్వారా అన్యాయం జరిగిందని వివరించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి దళితులపై కపట ప్రేమ చూపిస్తున్నారని విమర్శించారు. వేములవలస పంచాయతీ సర్వేనెంబర్ 152/1, 155/2లో 92 జగనన్న ఇళ్ల స్థలాల్లో ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన ఏ ఒక్కరికీ ఇవ్వలేదన్నారు. ఇందుకు స్థానిక వైసిపి నాయకులే కారణమని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మండల దళిత నాయకులు ఎ.మోహన్‌కుమార్, ఎల్.పైడిరాజు, ఆర్.ముకుందరావు, ఎల్.దశరధ, ఎల్.గురుమూర్తి, బి.ఆదిరాజు తదితరులు పాల్గొన్నారు.

సబ్‌ప్లాన్ నిధులు ఎస్‌సిల అభివృద్ధికి ఖర్చుపెట్టాలి

ప్రజాశక్తి -తగరపువలస : ఎస్‌సి సబ్ ప్లాన్ నిధులను పూర్తిగా వారి అభివృద్ధికే ఖర్చు చేయాలని వలువురు దళిత సంఘం నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. జివిఎంసి ఒకటో వార్డు పరిధి చిట్టివలస సెంటర్‌లోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ భవనంలో దళితులు ఎదుర్కొంటున్న సమస్యలపై మంగళవారం చర్చించారు. ఈ సందర్భంగా దళిత సంఘం నాయకులు సామంతుల సత్తిరాజు మాట్లాడుతూ, ఎస్‌సి అత్యాచార నిరోధక చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. దళిత సంఘం నాయకులు, న్యాయవాది గండవరపు కృష్ణ మాట్లాడుతూ, దళితుల సంక్షేమానికి గత, ప్రస్తుత ప్రభుత్వాలు ఏ మాత్రం చిత్త శుద్ధి కనబరచలేదని విమర్శించారు. టి.రవి మాట్లాడుతూ, పరిశ్రమల్లో స్థానిక నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో మామిడి వెంకట శివ, సోమి వెంకట్, టి.సూరిబాబు, ఎ.మోహనరావు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయాన్ని ఇండోజర్మన్ బృందం పరిశీలన

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం తర్లువాడ టి.నగరపాలెంలో ప్రకృతి వ్యవసాయాన్ని, నూతన పంటల సాగు విధానాన్ని ఇండో జర్మన్ గ్లోబల్ అకాడమీ ఫర్ ఆగ్రో ఎకాలజీ రీసెర్చ్ చెందిన మెంబర్స్, ఫార్మర్ సైంటిస్ట్ పాల్గొని పరిశీలించారు. విశాఖపట్నం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ మోహనరావు, విజయనగరం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ ఆనందరావు ఆధ్వర్యాన టి.నగరపాలెంలోని రైతు వెంకటలక్ష్మి వేసిన పంటలను పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయం, నూతన పంటల సాగు విధానంలో ఏ విధంగా పండిస్తున్నారు. మార్కెటింగ్ సౌకర్యం గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జి.రవిచంద్ర, సిహెచ్.విజయలక్ష్మి, నీలిమ, మెస్సీ, జిల్లా ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

పిఎంఎం హైస్కూల్‌ను సందర్శించిన డిఇఒ

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి పిఎంఎం ఉన్నత పాఠశాలను జిల్లా విద్యా శాఖాధికారి ఎల్.చంద్రకళ, ఎస్‌ఇఆర్‌టి ప్రొఫెసర్ శ్రీనివాస్, డిప్యూటీ డిఇఒ గౌరీశంకర్, మెక్సికోకు చెందిన ఐబి బృంద సభ్యులు, స్థానిక ప్రభుత్వ డైట్ ప్రిన్సిపల్ ఎల్.సుధాకర్, అధ్యాపకులు మంగళవారం సందర్శించారు. సైన్స్ ల్యాబ్‌ను పరిశీలించారు. ఇంగ్లీష్ ఏ మేరకు నేర్చుకున్నదీ 6వ తరగతి విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాల హెచ్ఎం తిరుమల శ్రీదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాల సందర్శనలో డిఇఒ చంద్రకళ తదితరులు

రెగ్యులర్ చేయాలని వినతి

ప్రజాశక్తి- సీతమ్మధార : తమను రెగ్యులర్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరుతూ డిఎం అండ్ హెచ్ఒ పి.జగదీశ్వరరావుకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో పని చేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు వినతిపత్రం అందించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు మంగళవారం గ్రీవెన్స్ ఏర్పాటుచేశారు. నేషనల్ హెల్త్ మిషన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు వివిధ కేడర్‌లో పనిచేస్తున్న స్టాఫ్ నర్సులు, పారామెడికల్, ఆప్తాలమిక్ అసిస్టెంట్లు, లాబ్ టెక్నిషియన్లు, ఫార్మసిస్ట్‌లు గ్రీవెన్స్‌కు వచ్చి తమ సమస్యలను వివరించారు. మినిమం టైం స్కేల్ అమలు చేయాలని కోరారు. దీనిపై డిఎం అండ్ హెచ్ఒ స్పందిస్తూ ఈ విషయాలను పైఅధికారులకు పంపించి తగు న్యాయం జరిగేలా ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగుల సంఘం ప్రెసిడెంట్ శశి భూషణ్, వైస్ ప్రెసిడెంట్ ఆర్.సురేష్, సెక్రటరీ వీరబ్రహ్మం, గోపీనాథ్, నాగరాజు, పిటివి.సత్యనారాయణ, కెవి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అదీప్‌రాజుకు పెందుర్తి టికెట్ ఖరారు?

ప్రజాశక్తి-పెందుర్తి : పెందుర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే టికెట్ వైసిపి నుంచి దాదాపు అన్నంరెడ్డి అదీప్‌రాజు పేరు ఖరారైనట్లు తెలుస్తోంది. 2019 ఎన్నికల్లో మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తిపై అదీప్‌రాజు గెలుపొందారు. 2004 ఎన్నికలకు సంబంధించి పెందుర్తి నియోజకవర్గం నుంచి వైసిపి అభ్యర్థులుగా పలువురి పేర్లు వినబడినప్పటికీ చివరికి అదీప్‌రాజుకే ఖరారయ్యే అవకాశాలు ఉన్నాయని స్థానికంగా చర్చ నడుస్తోంది. శారదా పీఠాన్ని ఇటీవల సందర్శించిన జగన్మోహన్‌రెడ్డి పెందుర్తిలో అదీప్‌రాజును పోటీ చేయమన్నట్లు ఆదేశించారని, దీంతో మార్చి 3వ తేదీన బహిరంగ సభ కూడా పెడుతున్నారని పలువురు చర్చించుకుంటున్నారు. అదీప్‌రాజు కూడా ప్రజల్లోకి వెళు_న్నారు. అధికారికంగా ప్రకటించడానికి మరి కొన్ని రోజులు వేచిచూడాల్సి ఉంది.

చందకలో జగనన్న ఆరోగ్య సురక్ష

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం, చందక గ్రామ సచివాలయం వద్ద మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఆనందపురం పిహెచ్‌సి వైద్యాధికారులు ఎం.గంగునాయుడు, కెజిహెచ్ స్పెషలిస్ట్ డాక్టర్లు పాల్గొని వివిధ గ్రామాల నుంచి వచ్చిన 456 మందికి రోగులకు వైద్యసేవలు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఉమావతి, స్థానిక సర్పంచ్ బంక శ్రీను, మండల డెవలప్‌మెంట్ అధికారి అప్పలనాయుడు, సామాజిక ఆరోగ్య అధికారి పి.సాంబమూర్తి, ఆరోగ్య పర్యవేక్షకులు డి.పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.

గోతులమయమైన జెర్రిపోతులపాలెం రహదారి

రహదారి అస్తవ్యస్తం

ప్రజాశక్తి-పెందుర్తి : మండలంలోని జెర్రిపోతులపాలెం రోడ్డు అస్తవ్యస్తంగా మారింది. షీలానగర్ నుంచి సబ్బవరం వైపు రోజు వందలాది వాహనాలు తిరుగుతుంటాయి. రైవాడ పైపులైన్ లీక్ కావడంతో రోడ్డు కోతకు గురై అస్తవ్యస్తంగా మారింది. గుంతలు ఏర్పడటంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రిపూట తృటిలో ప్రమాదాలు తప్పుతున్నాయి. పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదుచేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటుకు పరిశీలన

స్ట్రాంగ్ రూం పరిశీలనలో కలెక్టర్, ఎస్‌పి

ప్రజాశక్తి -నక్కపల్లి : స్థానిక జూనియర్ కళాశాలలో స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటుకు మంగళవారం జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి, ఎస్‌పి డాక్టర్ కెవి.మురళీకష్ణ పరిశీలన జరిపారు. పాయకరావు పేట నియోజకవర్గానికి సంబంధించి నక్కపల్లిలో స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటుకు జూనియర్ కళాశాల అనుకూలంగా ఉందా? లేదా అనేది తనిఖీ చేసారు. ఇవిఎంలు, ఎన్నికల సామగ్రిని భద్ర పరించేందుకు స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటు అవసరం ఉన్న నేపథ్యంలో ఈ పరిశీలన చేశారు. స్థానిక అధికారులు పాల్గొన్నారు .

నర్సీపట్నం టౌన్ : నర్సీపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటుకు జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, జిల్లా ఎస్‌పి కెవి.మురళీకృష్ణ పరిశీలించారు. స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటుకు నిరంతర విద్యుత్ సరఫరా, ఫైర్ సేఫ్టీ వంటి చర్యలు చేపట్టాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్‌డిఒ హెచ్‌వి.జయరాంను ఆదేశించారు. అనంతరం ఆర్‌అండ్‌బి బంగ్లా మరమ్మతు పనులను పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

గుంటూరు శ్రీనుపై సస్పెన్షన్ ఎత్తేయాలి

ప్రజాశక్తి- పాయకరావుపేట : పాయకరావుపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు గూటూరు శ్రీనివాసరావును వైసిపి సస్పెన్షన్ ఎత్తివేయాలని కోరుతూ మంగళవారం పేటలో ర్యాలీ నిర్వహించారు. పాయకరావుపేట పట్నంలోని పాండురంగస్వామి దేవాలయం నుంచి లక్ష్మీ థియేటర్ వరకు ప్లకార్డులు, పార్టీజెండాలు పట్టుకుని నినాదాలు చేస్తూ భారీ ర్యాలీ చేశారుదళిత నాయకులు నెలపర్తి అర్జున్ పాల్గొన్నారు.

వాలంటీర్లకు సేవా పురస్కారాలు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : మున్సిపాలిటీ పరిధిలోని పెదబొడ్డేపల్లి, శ్రీరామ్‌నగర్ కాలనీ సచివాలయం 7లో మంగళవారం వాలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మీ పాల్గొని ఉత్తమ వాలంటీర్లుకు సేవాఅవార్డులు అందజేసి సన్మానించారు. 8వ వార్డు ఐదవ సచివాలయంలో వైస్‌చైర్మన్ కోనేటి రామకృష్ణ, 16వ వార్డులో కౌన్సిలర్ జగదీశ్వరి వాలంటీర్లకు అవార్డులు అందించారు.

ఎఎల్.పురంలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-గొలుగొండ : మండలంలోని ఏఎల్‌పురం మేజర్ పంచాయతీలో గ్రామ సర్పంచ్ లోచల సుజాత ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు ముమ్మరంగా చేపడుతున్నారు. పేరుకుపోయిన చెత్తను జేసిబి సాయంతో తొలగింపజేశారు. ప్రజలు సహకరించాలని కోరారు. గ్రామాన్ని పారిశుధ్య రహిత గ్రామంగా తీర్చిదిద్దటమే లక్ష్యమన్నారు. ఎంపిటిసి చింతల బుల్లి ప్రసాద్ పాల్గొన్నారు.

ముమ్మరంగా 'ఉపాధి' సామాజిక తనిఖీలు

ప్రజాశక్తి-మాకవరపాలెం : మండలంలో 2022-23 ఏడాదిలో జరిగిన ఉపాధి పనులపై సామాజిక తనిఖీలు ముమ్మరంగా సాగుతున్నాయి. మంగళవారం మండల కేంద్రంలో జగనన్న కాలనీల్లో పునాదుల తవ్వకాలకు మంజూరు చేసిన ఉపాధి నిధులపై తనిఖీలు చేశారు.

కెజిబివిలో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి - కోటవురట్ల : విద్యార్థులకు వసతుల కల్పనకై ప్రత్యేక దృష్టి సారించాలని జిసిటిఒ పద్మావతి సూచించారు. సోమవారం రాత్రి కెజిబివి పాఠశాలను సందర్శించి, విద్యార్థులకు అందుతున్న వసతులను నిశితంగా పరిశీలించారు. విద్యార్థులు, సిబ్బందితో మాట్లాడి నేరుగా వివరాలు తెలుసుకున్నారు శత శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా విద్యార్థులను తీర్చిదిద్దాలని, ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలు విద్యార్థులకు అందే విధంగా చర్యలు తీసుకోవాలని పాఠశాల ప్రత్యేక అధికారి సరితాదేవికి సూచించారు.

పివిటిజిలకు ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు ఇవ్వాలి

ఆదివాసీ గిరిజన సంఘం గౌరవాధ్యక్షులు గోవిందరావు

మాట్లాడుతున్న గోవిందరావు

ప్రజాశక్తి-రోలుగుంట :పివిటిజి ఆదిమ గిరిజనులకు ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకం కింద ఉచిత గ్యాస్ కనెక్షన్లు ఇవ్వాలని ఆదివాసీ గిరిజన సంఘం గౌరవాధ్యక్షులు కె.గోవిందరావు డిమాండ్ చేశారు. మంగళవారం రోలుగుట మండలం లోసింగి గ్రామంలో కొండబాబు అధ్యక్షతన కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ రోలుగుంట, రావికమతం మండలాల్లోని మూడు పంచాయతీల్లోని 12 కొండశిఖర గ్రామాల్లో 150 పివిటిజి కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయన్నారు. వీరు వంట గ్యాస్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేయాలంటే నర్సీపట్నం, రావికమతం గ్యాస్ ఏజెన్సీ వద్దకు రావాలన్నారు. దీనికి వ్యయప్రయాసలతోపాటు మూడు,నాలుగు రోజుల సమయం పడుతుందన్నారు.. కేంద్ర ప్రభుత్వం కొండు ఆదివాసీ గిరిజనులను జన్మన్ ద్వారా అనేక పథకాలు ఇస్తామని ప్రకటన చేస్తున్నారని, అయితే అవి నాన్ షెడ్యూల్ గిరిజన గ్రామాలకు వర్తించడం లేదన్నారు. ప్రధానమంత్రి ఉజ్వల గ్యాస్ కనెక్షన్ దరఖాస్తు కోసం రావికమతం గ్యాస్ ఏజెన్సీకి వెళితే, సిస్టం సిగ్నల్ లేదంటూ తిప్పి పంపేశారని, దీంతో నేటికీ అనేక మంది గ్యాస్ కనెక్షన్ పొందలేకపోయా రన్నారు. దరఖాస్తు చేసి మూడు నెలలు గడస్తున్న నేపథ్యంలో. తక్షణమే వీరికి గ్యాస్ కనెక్షన్లు ఇవ్వాలని, లేకుంటే వచ్చేనెల 11న విశాలాక్షి నగర్ ఐటిడిఎ ఏజెన్సీ వద్ద ఆందోళన చేపడతామన్నారు. కార్యక్రమంలో రావికమతం మండల పివిటిజి సంఘం అధ్యక్షులు గెమ్మెల రాజు, ఉపాధ్యక్షులు కిలో పొట్టుదొర, రోలుగుంట మండలం కొర్ర కొండబాబు పాల్గొన్నారు.

అధిష్టానం నిర్ణయానికే కట్టుబడి ఉంటాం

ప్రజాశక్తి- చీడికాడ : తెలుగుదేశం, జనసేన పొత్తులో భాగంగా రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మాడుగుల ఎమ్మెల్యే అభ్యర్థిగా టిడిపి అధినేత చంద్రబాబు, అధిష్టానం ఎవరిని తీసుకొచ్చినా మండలంలోని టిడిపి కేడరంతా కలిసికట్టుగా పనిచేసి గెలిపించుకుంటామని స్పష్టం చేశారు. మంగళవారం పెద్ద గోగాడ గ్రామంలో మాజీ మంత్రి రెడ్డి సత్యనారాయణ కుమారుడు, పార్టీ గ్రామకమిటీ అధ్యక్షులు రాము ఆధ్వర్యంలో బూత్ కమిటీ సభ్యులు, టిడిపి శ్రేణులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ, నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో చేసిన సర్వే ఆధారంగా టికెట్ ఎవరికి ఇవ్వాలో చంద్రబాబు నిర్ణయిస్తారని, పార్టీ అధిష్టానం సూచించిన వ్యక్తినే ఎమ్మెలే గెలిపించుకుంటామని తీర్మానించారు. పార్టీ నేతలు, కార్యకర్తలుగా అభిప్రాయం వ్యక్తం చేయడం తప్పు కాదు గానీ, ఫలానా వ్యక్తికి టిక్కెట్ ఇస్తేనే గెలిపిస్తామని కొందరు నేతలు చెప్పడం సరికాదన్నారు.

మాట్లాడుతున్న టిడిపి నేత రాము

అణుకు రోడ్డు పనుల పరిశీలన

రోడ్డు పనులు పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి

ప్రజాశక్తి -కోటవురట్ల : మండలంలో గొట్టువాడ శివారు అణుకు ప్రాంతానికి ఏర్పాటు చేస్తున్న రోడ్డును మంగళవారం మండల ప్రత్యేక అధికారి ఉదయశ్రీ పరిశీలించారు, ఈ సందర్భంగా మాట్లాడుతూ జాతీయ ఉపాధి నిధులు రూ. 32 లక్షలతో 5 కిలోమీటర్ల రోడ్డును ఏర్పాటు చేస్తున్నామన్నారు. గిరిజనుల పోరాట ఫలితంగా వచ్చిన రోడ్డు పనులను నాణ్యతతో చేపట్టి, త్వరితగతని పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు, కార్యక్రమంలో ఎంపిడిఒ కాశీ విశ్వనాథరావు, పంచాయతీరాజ్ ఇంజనీర్ వర్మ, పొందూరు మాజీ సర్పంచ్ నారాయణరావు, గొట్టువాడ వైసిపి నాయకులు రమేష్ పాల్గొన్నారు.

180 మందికి ఆరోగ్య సురక్ష పరీక్షలు

ప్రజాశక్తి -కోటవురట్ల : ఆరోగ్యం పట్ల ప్రతిఒక్కరూ శ్రద్ధ చూపాలని పిహెచ్‌సి డాక్టర్ సంతోష్‌కుమార్ సూచించారు. మంగళవారం కొడవటిపూడి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో 180 మంది రోగులకు వైద్య పరీక్షలు, కంటి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఎంపిడిఒ కాశీ విశ్వనాథరావు, స్థానిక సర్పంచ్ కోసూరి అప్పారావు, కార్యదర్శి భాగ్యలక్ష్మి, విఆర్‌ఒ వెంకట సుధాపాల్గొన్నారు.

ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ సందర్శన

ప్రజాశక్తి-గొలుగొండ : వృత్తి విద్య శిక్షణలో భాగంగా సర్వ శిక్ష అభియాన్ స్కిల్ ట్రీ కన్సల్టెన్సీ ద్వారా ఒకేషనల్ ఎడ్యుకేషన్ ట్రైనర్ ప్రత్యక్షంగా బోధించిన అనుభవాలతో ఉత్తమ అభ్యసనం కోసం మంగళవారం గొలుగొండ డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ ఆర్.రామకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ కెవి.రమణ ఆధ్వర్యంలో ఆ పాఠశాల. 9వ తరగతతి ఐటి-ఐటిఈఎస్ విద్యార్థులు నర్సీపట్నం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను సందర్శించారు.కళాశాలోని కంప్యూటర్ ల్యాబ్‌ను పరిశీలించారు. వాటి పనితీరు గురించి తెలుసుకున్నారు.

'పది'లో మెరుగైన ఫలితాల సాధన లక్ష్యం

ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డిప్యూటీ డిఇఒ

ప్రజాశక్తి- నక్కపల్లి : పదో తరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాల సాధనకు ఉపాధ్యాయులంతా కృషి చేయాలని ఉప విద్యాశాఖా ధికారి అప్పారావు సూచించారు. .మంగళ వారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో పదవ తరగతి సంసిద్ధతా పరీక్షలను పరిశీలించారు. వెనుకబడిన విద్యార్థుల గురించి ఆరా తీశారు. పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో వారిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. విద్యార్థుల సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేయాలన్నారు. ఫార్మేటివ్ పరీక్షల సమాధాన పత్రాలను, నోట్స్‌లను పరిశీలించారు. స్థానిక బాలురు, బాలికల ఉన్నత పాఠశాలలో లిప్ మండలస్థాయి బృందం పరిశీలించి, విద్యార్థులు అభ్యసన స్థాయిలను పరిశీలించారు. రికార్డులను, బోధన, సాధనా పీరియడ్స్ పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఇఒ కె.నరేష్, దేవవరం, పెదరామభద్రపురం హైస్కూలు హెచ్ఎంలు వేమగిరి నూకరాజు, కోడి శ్రీనివాసరావు, హెచ్ఎంల .అసోసియేషన్ ప్రతినిధి శాస్త్రి, లిప్ మండల బృందం పాల్గొంది.

THE CHODAVARAM COOPERATIVE SUGARS LIMITED, GOVADA-531 023
Chodavaram Mandal, Anakapalli District, A.P.

E-AUCTION TENDER NOTICE

E-auction for sale of 1500 M.Ts of Filter Cake of the Chodavaram Cooperative Sugar Limited, Govada pertaining to 2023-24 crushing season's production will be conducted through AP e-procurement (Konugolu Portal) on 06-03-2024 from 11.00 A.M. to 2.00 P.M. The Filter Cake buyers can go through AP-eprocurement (Konugolu Portal) Konugolu.ap.gov.in for terms & Condition of e-auction.

GOVADA, Dt. 27-02-2024 **(Tender ID No. 23486)** **MANAGING DIRECTOR**

పీజీ కోర్సులను అందుబాటులోకి తేవాలి

కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎస్‌ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : నర్సీపట్నం అల్లూరి సీతారామరాజు డిగ్రీ కళాశాలలో పిజి, ఎంబిఎ, ఎంసిఎ, ఎంఎస్‌సి, ఇతర పోస్టుగ్రాడ్యుయేషన్ కోర్సులు అందుబాటులోకి తీసుకురావాలని ఎస్‌ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు జి.గీతాకృష్ణ కోరారు. మంగళవారం నర్సీపట్నం వచ్చిన జిల్లా కలెక్టర్ రవిపట్టన్‌శెట్టికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గీతాకృష్ణ మాట్లాడుతూ నర్సీపట్నం ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల్లో డిగ్రీ, ఇతర కోర్సులు చదువుతున్న విద్యార్థులు సుమారు 5వేల మంది వరకు ఉన్నారన్నారు. వీరు డిగ్రీ పూర్తయ్యాక పీజీ చదువుల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితులలో, చాలామంది పోస్టుగ్రాడ్యుయేషన్ కోర్సులకు వెళ్లలేన మధ్యలోనే చదువు ఆపేస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో నర్సీపట్నంలో పిజి కోర్సులు అందుబాటులోకి తేవాలని కోరారు.కార్యక్రమంలో ఎస్‌ఎఫ్ఐ డివిజన్ ప్రెసిడెంట్ గౌతమ్, మండల ప్రెసిడెంట్ రాజుబాబు పాల్గొన్నారు.

డివికి అభినందనల వెల్లువ

ప్రజాశక్తి- కోటవురట్ల: రాష్ట్ర చిన్న, సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమల చైర్మన్‌గా నియమితులైన మాజీ ఎమ్మెల్సీ డివి సూర్యనారాయణ రాజుకు అభినందనలు వెల్లువెత్తు తున్నాయి. మంగళవారం ఆయన క్యాంపు కార్యాలయానికి మండలంలోని పలు గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు వచ్చి అభినందనలు తెలిపారు. గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు పదవినిచ్చిన ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.



సూర్యనారాయణరాజును అభినందిస్తున్న నేతలు

IN THE HON'BLE COURT OF THE II ADDL. SENIOR CIVIL JUDGE AT: VISAKHAPATNAM
I.P.10/2024

Between:
Sri Pulluru Dilip Kumar,
S/o. P. Kesavulu, Hindu,
aged 36 years, R/at D.No.8-272/9/1,
VUDA Colony, Gopalapatnam,
Visakhapatnam ...Petitioner
And:
B. Varun Rohit & 22 others
...Respondents

GENERAL NOTICE

The public are hereby informed that the above petitioner filed the above I.P.No.10/2024 on the file of the Hon'ble II Addl. Senior Civil Judge Court, at Visakhapatnam to declare him as an insolvent and the matter stands posted to **06-03-2024** for hearing. So public are hereby informed that any objections can be raised in the above case before the Hon'ble Court on **06-03-2024** either in person or through an Advocate at **10:30 A.M.**

(By Order of the Hon'ble Court)
HABEEB SULTANA ALI
B. NARASINGA RAO,
P. HYMA,
B. KAVITHA &
G. SYAMALA DEVI
Advocates
Visakhapatnam,
Cell No. 9885355102.

మహారాజశ్రీ విశాఖపట్నం 2వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు వారి కోర్టులో
I.P. No. 13/2024

బిట్వీన్: ముమ్మిడిశెట్టి విజయ్ RSVG కుమార్ ... పిటిషనర్

మరియు:
1. ఓగిరెడ్డి సతీష్ రెడ్డి
2. బుర్లి గురునాయుడు
3. పెంటకోట సరస్వతి
4. పొట్నూరు కృష్ణారావు
5. పతివాడ సంతోష్ ప్రసాద్
6. బుట్టల గణేశ్వరరావు
7. ఎ.వి.శివకుమార్
8. ముమ్మిడిశెట్టి గోపాల్‌కృష్ణ
9. జగ్గుమంత్రి చిరంజీవి సాయిరాం
10. నెట్టిమి రామచంద్ర
11. శంబంగి సత్యనారాయణ
12. ఎస్.శ్యామలరావు
13. మదాల దక్షిణమూర్తి
14. అన్వేష్ చిన్ని ... రెస్పాండెంట్లు

పైన పేర్కొనబడిన పిటిషనర్, పై కోర్టు వారి దివాలా కోరు వాజ్యం నెం. 13/2024 పైన పేర్కొనబడిన రెస్పాండెంట్లు పైన దాఖలా చేయగా తేది:11-03-2024 వాయిదా వేసి ఉన్నారు. కావున సదరు వాజ్యం పై పైన పేర్కొనబడిన రెస్పాండెంట్లునేకాక ఎవరికైనను ఎట్టి ఆక్షేపణలు ఉన్న యెడల **తేది: 11-03-2024 ఉదయం 10-30 గం॥లకు** స్వయంగా గానీ వకీలు ద్వారా గాని పై కోర్టులో హాజరై తమ యొక్క ఆక్షేపణలు తెలియజేసుకొన వలసినదిగా ఇందుమూలంగా యావన్మంది ప్రజానీకానికి తెలియజేయడమైనది. పై కోర్టు వారి ఆదేశానుసారము ఈ ప్రకటన జారీ చేయడమైనది.

పూసర్ల సురేష్ కుమార్, న్యాయవాది, విశాఖపట్నం. సెల్ : 9848975113

రెడీమేడ్‌తో దర్జీల బతుకు బేజారు...

- వృత్తిని వీడ లేక.. ప్రత్యామ్నాయం చేత గాక...
- రెట్టింపైన ముడి సరుకు ధరలు..

ప్రజాశక్తి - యంత్రాంగం

తగరపువలస : ప్రయివేటీకరణ, ప్రపంచీకరణ, సరళీకరణ విధానాలు మిగిలిన చిన్నా, చితక రంగాల మాదిరిగానే చేతివృత్తులపై కూడా తీవ్ర ప్రభావం చూపిందనే చెప్పాలి. ముఖ్యంగా రెడీమేడ్ దుస్తుల విక్రయాలతో టైలరింగ్ వృత్తికి పెద్ద దెబ్బ తగిలింది. ఉపాధి మార్గంగా ఉన్న టైలరింగ్ నేడు దీనావస్థకు చేరిందని పలువురు టైలర్లు వాపోతున్నారు.

బతుకు భారమై..

తగరపువలస, చిట్టివలస ప్రాంతంలో 60 టైలరింగ్ దుకాణాలు ఉన్నాయి. ఇళ్లల్లో బట్టలు కుట్టి ఉపాధి పొందే వారు ఇంకొందరు ఉన్నారు. 60 దుకాణాల్లో యజమానులు గాకుండా సుమారు 150 మంది వరకు కార్మికులు పని చేస్తున్నారు. ఫ్యాంట్, షర్ట్ కుడితే రూ 600 మజూరు (చార్జీ) తీసుకుంటున్నారు. ఇందులో నుంచే దుకాణంలో పనిచేసే కార్మికునికి రూ.250 ఇస్తున్నట్లు యజమానులు చెబుతున్నారు. ముడిసరుకు రూ.200, మిగిలేది రూ.150 అని వివరించారు. కాజాలు, బటన్లు వేసే వారికి రూ.15, ఇస్త్రీకి రూ.20, వచ్చిన ఈ కొద్ది మొత్తంలోనే భరించాలని చెబుతున్నారు. ఇందులోనే దుకాణం అద్దెలు, కరెంట్ బిల్లులు, మిషన్ మరమ్మతులు, ఇతరత్రా ఖర్చులు పెట్టుకోవాలని వారి కష్టాలు వివరించారు.

రెడీమేడ్ ప్రవేశంతో అవస్థలు..

మారుతున్న కాలానికి అనుగుణంగా రెడీమేడ్ వస్త్రాల కొనుగోలుకు యువతీ యువకులు ఆసక్తి కనబరుస్తున్నారు. ఇదే అదునుగా భావించిన కొందరు రెడీమేడ్ వ్యాపారులు ఆఫర్లు చూపి యువతను ఆకర్షిస్తున్నారు. టైలరింగ్ వృత్తినే నమ్ముకుని జీవనం సాగిస్తున్న వారి ఉపాధికి తీవ్రంగా దెబ్బ తగులుతుంది.

రెట్టింపైన ముడి సరుకు ధరలు..

ముడి సరుకు ధరలు ఏటా రెట్టింపవుతున్నాయి. షర్ట్, ఫ్యాంట్‌కు అవసరమైన రెండు దారపు ఉండలు ధర కిందటి ఏడాది రూ.8 ఉండగా, ఇప్పుడు రూ.12కు చేరింది. కాజా, బటన్లుకు రూ.20 నుంచి రూ30కి, జిప్ రూ.4 నుంచి రూ.6కి, రెండు హుక్కులు రూ.5 నుంచి రూ.10కి, ఫ్యాంట్, షర్ట్‌కు చెరో బకరం రూ.15 నుంచి రూ.20కి, కత్తెర ధర రూ.250 నుంచి రూ.350కి పెరిగినట్లు టైలర్లు చెప్పారు. జూకి కంపెనీ మిషన్ గతంలో రూ.15 వేలు ఉండగా నేడు రూ.26 వేలు ఉన్నట్లు చెప్పారు. ఏడాదిలో రెండు సార్లు మిషన్ రిపేరు చేయాల్సి వస్తుందని, ఆ సమయంలో రూ.వెయ్యి నుంచి రూ.రెండు వేలు ఖర్చు అవుతుందని అంటున్నారు కొందరు టైలర్లు.

అద్దెలు... పన్నులు..

తగరపువలసలో ఏ ఒక్కరికీ సొంత దుకాణం లేదు. నెలకు రూ.5 వేలు నుంచి రూ.8 వేలు వరకు అద్దెలు చెల్లిస్తూ దుకాణాలు నడుపుతున్నామని టైలర్లు చెబుతున్నారు. కరెంట్ చార్జీలు కూడా పెరిగాయని తెలిపారు.

టైలర్ పనికి ఆసక్తి చూపని యువత

పద్మనాభం : మండలంలోని పలు గ్రామాల్లో టైలర్లు కనమరుగవుతున్నారు. ఈ వృత్తి పట్ల యువత ఆసక్తి చూపడంలేదు. ఇంతవరకు ఈ వృత్తిని చేసిన వారు వృద్ధాప్యానికి చేరడంతో పనిచేయలేక విడిచిపెడుతున్నారు. దీంతో గ్రామాల్లో టైలర్లు లేని పరిస్థితి ఏర్పడుతోంది. పద్మనాభం జంక్షన్‌లో సిట్టు టైలర్ వద్ద రోజువారి కూలి కింద ఐదుగురు పనిచేస్తున్నారు. రెడ్డిపల్లి గ్రామంలో లేడీస్ టైలర్ ప్రసాద్ వద్ద సుమారు 8 మంది మహిళలు పనిచేస్తున్నారు. వీరిలో రోజూ ఇద్దరు, ముగ్గురు పనిలోకి రారని ఆ యజమానులు చెబుతున్నారు. రేవిడి పంచాయతీలో ఒక టైలర్ షాప్ కూడా లేదు. సమీపంలో ఉన్న తగరపువలస వెళ్లి వారు దుస్తులు కుట్టించుకుంటామని స్థానికులు చెబుతున్నారు. కొంతమందికి ఇళ్లల్లో సొంత మిషన్లు ఉన్నాయి. వారి దుస్తులు మాత్రమే కుట్టుకుంటారు.

గ్రామస్థాయిలో 90 శాతం మహిళలు రెడీమేడ్ దుస్తుల వైపు మొగ్గుచూపరు. వారంతా దుస్తులు కుట్టుంచుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఇతర గ్రామాలకు వెళ్లి కుట్టించుకుంటున్నారు. గ్రామస్థాయిలో వృత్తి రీత్యా ఉన్న టైలర్లలో గంగవరంలో ఇద్దరు, పద్మనాభంలో ఇద్దరు, అనంతవరంలో ముగ్గురు, రెడ్డిపల్లిలో ముగ్గురు, అయినాడలో ఒకరు, పాండ్రంగిలో ఇద్దరు, పొట్నూరులో ఇద్దరు, కృష్ణాపురంలో ఒక టైలరు ఉన్నారు.

పోటీని తట్టుకుని నిలబడలేక పోతున్నాం

ప్రస్తుత మార్కెట్‌లో పోటీని తట్టుకుని నిలబడలేకపోతున్నాం. రెడీమేడ్ షర్ట్‌లు రూ.1000కి మూడు అందిస్తుండటంతో యువత అటువైపే ఆసక్తి చూపుతున్నారు. ఈ పరిస్థితుల్లో నమ్ముకున్న వృత్తిని వదులుకోలేక కాలం వెళ్లదీస్తున్నాం.

పెంటపల్లి శ్రీనివాసరావు
టైలర్, తగరపువలస

టైలర్లను ఆదుకోవాలి

ఎన్నో ఏళ్లగా వృత్తినే నమ్ముకుని జీవిస్తున్న టైలర్లను ప్రభుత్వాలు ఆదుకోవాలి. 50 ఏళ్ల పైబడిన చేనేత కార్మికుల కు పింఛన్లు మంజూరు చేయాలి. ఉచిత నేత్ర వైద్య పరీక్షలు జరిపి, కళ్లజోళ్లు ఇవ్వాలి. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇవ్వాలి.

గిడుతూరి శ్రీనివాసరావు
టైలర్, తగరపువలస.

దేవుడమ్మ, రవణమ్మల వర్ధంతి

ప్రజాశక్తి -గాజువాక : సిపిఎం దశమకొండ ఏరియా నాయకులుగా పనిచేసి మృతిచెందిన దేవుడమ్మ, రవణమ్మల వర్ధంతిని దశమకొండలోని పార్టీ కార్యాలయంలో ఐద్వా ఆధ్వర్యాన మంగళవారం నిర్వహించారు. వారి చిత్రపటాలకు ఐద్వా నాయకులు కె.సంతోషం పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, దశమకొండ కాలనీ నిర్మాణం కోసం వారు ఎన్నో పోరాటాలు చేశారని గుర్తుచేశారు. పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలన్న పోరాటం జైలుకు కూడా వెళ్లారని తెలిపారు. కిరీటం మాట్లాడుతూ, వారి ఆశయ సాధనకు మనమంతా ముందుకు సాగాలని కోరారు. పల్లెల నర్సింగరావు మాట్లాడుతూ, ఎర్రజెండాతోనే పేదలకు న్యాయం జరుగుతుందని నమ్మిన సిద్ధాంతం కోసం వారు పనిచేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంగ, లక్ష్మి, వరలక్ష్మి పాల్గొన్నారు.

దేవుడమ్మ రవణమ్మకు చిత్రపటానికి పూలమాల వేస్తున్న సంతోషం, కిరీటం, నర్సింగరావు

శ్రీవిజ్ఞాన్ బ్రిలియంట్‌లో సైన్స్ డే

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి 85వ వార్డు పరిధి కొండయ్యవలసలో ఉన్న శ్రీవిజ్ఞాన్ బ్రిలియంట్ స్కూల్లో జాతీయ సైన్స్ డేను మంగళవారం నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథి గాజువాక ఇండస్ట్రియల్ ఏరియా ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ అధ్యక్షులు పి.భాస్కరరావు, ఎడిసి చైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ హాజరయ్యారు. వారు ముందుగా సివి రామన్ చిత్రపటానికి పూలమాలవేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం పాఠశాల విద్యార్థులు ఏర్పాటుచేసిన 110 సైన్స్ ప్రదర్శనలను పరిశీలించారు. ఈ సందర్భంగా పి.భాస్కరరావు మాట్లాడుతూ, ప్రతి విద్యార్థి కాలానికి అనుగుణంగా అర్థం చేసుకొని, శాస్త్రీయ సాంకేతిక పద్ధతులను అవగాహన చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ కెవి సత్యనారాయణ, ప్రిన్సిపల్ కె.పద్మావతి, స్థానిక పెద్దలు విందుల వరహాలు, సాయిని సన్యాసిరావు, విందుల మోహన్ రావు, ప్రయివేటు పాఠశాల ప్రతినిధులు చిట్టి సుజాత, ఎస్‌వికె.పరశురాం, కెవి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సైన్స్ డే ప్రదర్శనలను పరిశీలిస్తున్న ముఖ్య అతిథులు

వైజాగ్ ఫిలింనగర్ కల్చరల్ సెంటర్ అధ్యక్షునిగా కాయల

ప్రజాశక్తి-సీతమ్మధార : వైజాగ్ ఫిలింనగర్ కల్చరల్ సెంటర్ అధ్యక్షునిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మారిటైమ్ బోర్డ్ చైర్మన్ కాయల వెంకటరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యదర్శిగా సిహెచ్.శ్రీనివాసరాజు, ఉపాధ్యక్షునిగా ఆర్‌వి.చంద్రమౌళిప్రసాద్, సంయుక్త కార్యదర్శిగా ఎంఎస్ఎన్. రాజు, కోశాధికారిగా ఎస్ఆర్.గోపినాథ్ ఎన్నికయ్యారు. ప్రముఖ స్టార్ మేకర్ ఎల్ సత్యానంద్‌ను సభ్యుల్లో ఒకరిగా ఎన్నుకున్నారు.

నేరాలు ఘోరాలు

నాటుసారా బట్టీలపై పోలీసుల దాడులు

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని వాలాబు, రైవాడ పంచాయితీల పరిధిలోని గ్రామాల్లో ఉన్న నాటుసారా బట్టీలపై పోలీసులు మంగళవారం దాడులు చేశారు. ఈ దాడుల్లో 1900 లీటర్ల బెల్లం పులుపును ధ్వంసం చేశారు. 2 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకొని ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. అనంతరం అనకాపల్లి డిఎస్‌పి వి.సుబ్బరాజు మాట్లాడుతూ ఎవరైనా నాటుసారా తయారీ చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో కె.కోటపాడు సర్కిల్ పరిధిలోని ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

20 లీటర్ల సారాతో వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండలంలోని మారేడుబాక శివారు అటవీ ప్రాంతంలో సారా బట్టీపై జడ్డంగి ఎస్ఐ రఘునాథరావు ఆధ్వర్యంలో సిబ్బంది మంగళవారం దాడులు నిర్వహించారు. 200 లీటర్ల బెల్లం ఊట, సామాగ్రిని ధ్వంసం చేశారు. సారా బట్టి నిర్వాహకుడు మారేడుబాక గ్రామానికి చెందిన బెన్నోజు లోవకుమార్‌ని అరెస్టు చేసి, ఆయన వద్ద నుండి 20 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి నిందితుడిని అడ్డతీగల కోర్టుకు తరలించగా, మెజిస్ట్రేట్ 15 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్ఐ రఘునాథరావు తెలిపారు.

నేడు ఆదర్శనగర్‌లో ఆరోగ్య సురక్ష

ప్రజాశక్తి -తగరపువలస : జివిఎంసి రెండో వార్డు ఆదర్శనగర్-1 సచివాలయం వద్ద ఈ నెల 28న ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు జోనల్ కమిషనర్ కె.కనకమహాలక్ష్మి తెలిపారు. శిబిరాన్ని వినియోగించుకోవాలని ప్రజలకు సూచించారు.

టైటిల్‌యాక్ట్ నష్టదాయకం

ప్రజాశక్తి -గాజువాక : రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన టైటిల్ యాక్ట్ ప్రజలకు నష్టదాయకమని సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు తెలిపారు. ఈ యాక్ట్‌ను వ్యతిరేకిస్తూ న్యాయవాదులు గాజువాక కోర్టు కాంప్లెక్స్‌లో మంగళవారం దీక్ష చేపట్టారు. ఈ దీక్షకు ఆయన మద్దతు తెలుపుతూ మాట్లాడారు. ఈ యాక్ట్ వల్ల పేద మధ్యతరగతి ప్రజలకు న్యాయం దొరకదని, దీన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్‌చేశారు. ప్రజాస్వామ్యంలో న్యాయం అనే పదం మరుగున పడిపోద్దన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం దీనిపై పునరాలోచించి రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు నరేంద్ర, ఎ.సీతామహాలక్ష్మి పాల్గొన్నారు.

యువత కలలను సాకారం చేయాలి

ప్రజాశక్తి - ములగాడ : యువత కలలను సాకారం చేయాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని జాతీయ సేవా పథకం ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.హరినాథ్ పేర్కొన్నారు. యువ సంవాద్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, 2047కి భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా చూడాలని దేశ ప్రజలందరూ ముఖ్యంగా యువత ఆశిస్తున్నారని తెలిపారు. దేశాభివృద్ధి గురించి దాదాపు 30 మంది యువత తమ అభిప్రాయాలను యువ సంవాద్‌లో తెలియజేశారు. కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేసిన జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రామ్ అధికారి ఇపిఎస్.భాగ్యలక్ష్మి, సీనియర్ ప్రోగ్రాం అధికారి వై.అనసూయదేవిని అంతా అభినందించారు. యువ సంవాద్‌లో నిర్వహించిన వక్తృత్వ పోటీలో విజేతలైన సెయింట్ ఆన్స్ విద్యార్థినులకు ప్రశంసా పత్రాలలు బహుమతులు అందించి సత్కరించారు. వీరిని సెయింట్ ఆన్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిస్టర్ ప్రేమకుమారి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు జివిఎల్.నరసింహారావు, మాజీ ఎమ్మెల్సీ పివిఎన్.మాధవ్, తదితరులు పాల్గొన్నారు.

2 నుంచి కోర్టు ఫైలింగ్‌పై గీతం వర్క్‌షాప్

ప్రజాశక్తి- విశాఖపట్నం : న్యాయ విద్యను అభ్యసించే విద్యార్థులకు గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ లా ఆధ్వర్యాన మార్చి 2 నుంచి 4వ తేదీ వరకు కోర్టు ఫైలింగ్ ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు గీతం స్కూల్ ఆఫ్ లా డైరక్టర్ డాక్టర్ ఆర్.అనితారావు తెలిపారు. విద్యార్థులకు ప్రముఖ న్యాయవాదులతో నైపుణ్యశిక్షణతో పాటు న్యాయపరమైన డాక్యుమెంట్‌లను అర్థం చేసుకుని వాటిని కోర్టు కేసుల సందర్భంలో న్యాయస్థానంలో సమర్పించే పద్ధతులు, న్యాయ సంబంధ దరఖాస్తులపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 29వ తేదీలోగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

ప్రేమ సమాజం ఆడిటోరియంలో లిఫ్ట్ ఏర్పాటు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : డాబాగార్డెన్స్ ప్రేమ సమాజం ప్రాంగణంలో ఉన్న కంచర్ల అన్నపూర్ణ దేవి ఎసి ఆడిటోరియంకు సమాజం మాజీ అధ్యక్షులు కంచర్ల రామబ్రహ్మం ఆర్థిక సహాయంతో లిఫ్ట్ ఏర్పాటు చేసి, మంగళవారం ఆయన చేతులు మీదుగా ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో రామబ్రహ్మం మాట్లాడుతూ సమాజం స్థాపించిన నాటి నుండి నేటి వరకు తన తాత, కంచర్ల రామబ్రహ్మం, తండ్రి కంచర్ల సుబ్రహ్మణ్య దత్తు, అనంతరం తాను సేవలు అందించామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు మట్టపల్లి హనుమంతరావు, కేశప్రగడ నరసింహమూర్తి, కార్యదర్శి కె.హరి మోహన్ రావు, కోశాధికారి ఎంవివికె.గుప్తా, సంయుక్త కార్యదర్శి వి.మోహన్ రావు, సభ్యులు కంచర్ల కృష్ణ కుమార్, కోన జగదీశ్వరరావు, పైడా కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.

మోసాలకు నిలయం వైసిపి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : అన్యాయాలు, అబద్ధాలు, మోసాలకు నిలయం వైసిపి అని తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత విమర్శించారు. మంగళవారం టిడిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ దండుపాళ్యం బ్యాచ్‌తో జగన్ సభలు నిర్వహిస్తున్నారని ఎద్దేవా చేశారు. ఇచ్చిన హామీలు నెరవేర్చని వ్యక్తి జగన్ అన్నారు. మద్యం లేకుండా చేసి ఓట్లు అడుతానని హామీ ఇచ్చి, కొత్త మద్యం పాలసీ తెచ్చి అక్రమంగా సంపాదిస్తురని ఆరోపించారు. రాష్ట్రంలో నకిలీ మద్యం ముంచెత్తి 30 లక్షల కుటుంబాల్లో ఆరోగ్య సమస్యలు తెచ్చిపెట్టారన్నారు. రాష్ట్రానికి రాజధాని, పోలవరం, ప్రత్యేక హోదా, విశాఖకు రైల్వే జోన్ లేకుండా సిద్ధం అని జగన్మోహన్ రెడ్డి అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. చేతకాని, చేవలేని కోడి గుడ్డు మంత్రి ఎవరని అడిగితే ఠక్కున ప్రజల నుంచి వచ్చే మాట అమర్‌నాథ్ అని ఎద్దేవా చేశారు. ఫొటోలకు పోజులు తప్ప ఆయన తెచ్చిన కంపెనీలు ఏవీ లేవన్నారు. ఇష్టానుసారంగా మాట్లాడితే గుడ్డు పగులుద్ది అంటూ లైవ్‌లో అనిత గుడ్డు పగలగొట్టారు.

చలో తాడేపల్లిగూడెం పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఈ నెల 28వ తేదీ బుధవారం తాడేపల్లిగూడెంలో జరగనున్న జనసేన - టిడిపి సభకు ప్రజలంతా తరలి రావాలని జనసేన విశాఖ జిల్లా అధ్యక్షులు వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ పిలుపునిచ్చారు ఈ మేరకు మంగళవారం సాయంత్రం ఆయన క్యాంపు కార్యాలయంలో ఈ కార్యక్రమానికి సంబంధించిన చలో తాడేపల్లిగూడెం పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు కందుల నాగరాజు, పసుపులేటి ఉషాకిరణ్, సంకు వెంకటేశ్వరరావు, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - డుంబ్రిగుడ: మారుమూల గిరి గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించడమే వైసిపి ప్రభుత్వ ధ్యేయమని ఎంపిపి బి ఈశ్వరి, జెడ్‌పిటిసి సిహెచ్ జానకమ్మ అన్నారు. మండలంలోని గసభ రోడ్డు జంక్షన్ నుంచి సిరసగూడ మీదుగా సిమిలిగూడ వరకు రూ.65 లక్షలతో నూతనంగా మంజూరైన గ్రావెల్ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల విజ్ఞప్తికి ఎమ్మెల్యే ఫాల్గుణ స్పందించి నిధులు మంజూరు చేశారన్నారు. కార్యక్రమంలోఎంపిటిసి జేమ్మ, వైస్ ఎంపిపి ఎస్ ఆనంద్, సర్పంచ్ నాగేశ్వరరావు, సీనియర్ నాయకులు బి సింహాచలం, సిహెచ్ కృష్ణారావు పాల్గొన్నారు.

నాటుసారా పులుపు ధ్వంసం

ప్రజాశక్తి - డుంబ్రిగుడ : ఆంధ్ర ఒడిస్సా సరిహద్దులో మండలంలో రాయపాడు గ్రామంలో మంగళవారం ఎస్ఐ సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో ఆంధ్రా, ఒడిశా పాడువా స్టేషన్ పోలీసుల సంయుక్తంగా నిర్వహించిన దాడుల్లో నాటుసారా తయారీకి సిద్ధంగా ఉంచిన 3200 లీటర్ల బెల్లం పులుపును పోలీసులు ధ్వంసం చేశారు.

ఆత్మస్థైర్యంతో పరీక్షలు రాయండి

ప్రజాశక్తి -డుంబ్రిగుడ : ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలను విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి గురికాకుండా ఆత్మస్థైర్యంతో రాసి ఉత్తీర్ణులు కావాలని జిల్లా ఇంటర్మీడియట్ పరీక్షల పర్యవేక్షణ ప్రత్యేక అధికారి వినోద్ బాబు సూచించారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫేర్‌వెల్ వేడుకలో పాల్గొన్నారు. విద్యార్థులు గిరిజన సంప్రదాయమైన థింసా నృత్యాలు, ఆటపాటలతో సందడి చేశారు. ఈ సందర్భంగా వినోద్‌బాబు విద్యార్థులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, కళాశాల హెచ్‌డబ్ల్యుఒ పలాసి రవికుమార్ పాల్గొన్నారు.

ఫ్లోటింగ్ బ్రిడ్జి విషయంలో..

పర్యాటకులను భయభ్రాంతులకు గురిచేయొద్దు

విఎంఆర్‌డిఎ కమిషనర్ డాక్టర్ ఎ.మల్లికార్జున

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : పర్యాటకులను విశేషంగా ఆకట్టుకునే క్రమంలో విశాఖ సాగరతీరంలో ఏర్పాటు చేసిన ఫ్లోటింగ్ బ్రిడ్జి తెగిపోయిందన్న వార్తల్లో ఏమాత్రమూ వాస్తవం లేదని, మాక్ డ్రిల్‌లో భాగంగానే టి- పాయింట్‌ను వేరు చేశామని స్పష్టం చేస్తూ విఎంఆర్‌డిఎ కమిషనర్ డాక్టర్ ఎ.మల్లికార్జున మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. పర్యాటకులను భయభ్రాంతులకు గురిచేయొద్దని కోరారు. విశాఖ లాంటి మహా నగరం ఖ్యాతిని మరింత పెంచేందుకు విశేషమైన కృషి చేస్తున్నామని, దానిలో భాగంగానే కేరళలో అమలు చేస్తున్న ప్రాజెక్టును అధ్యయనం చేసి విశాఖ వేదికగా ఫ్లోటింగ్ బ్రిడ్జిని ప్రారంభించామని పేర్కొన్నారు. సోమవారం వాతావరణంలో ప్రతికూలత వల్ల అలల తాకిడి ఎక్కువగా ఉండటంతో ముందుగానే పర్యాటకులను అనుమతించలేదని, ఒక్క టికెట్ కూడా విక్రయించలేదని స్పష్టం చేశారు. టికెట్లు అమ్మకుండా.. పర్యాటకులను అనుమతించకుండా ముందు జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ.. సంబంధిత వాస్తవాలను తెలియజేస్తూ ప్రకటన విడుదల చేసినప్పటికీ.. వాస్తవాలను దాటి పెనుప్రమాదం తప్పిందని వార్తలు ప్రచురించటం సరికాదని పేర్కొన్నారు. వాస్తవానికి బ్రిడ్జి తెగిపోలేదని.. మాక్ డ్రిల్‌లో భాగంగా రెండింటినీ వేరు చేసి లంగరు వేశామని పేర్కొన్నారు. సముద్రంలో ప్రతికూల పరిస్థితులున్న సమయాల్లో ఇలాంటి మాక్ డ్రిల్స్ భవిష్యత్తులో కూడా నిర్వహిస్తామని చెప్పారు. ప్రధాన వంతెన, టి పాయింట్ విడివిడిగా ఉండటం చూసి తప్పుగా అర్థం చేసుకున్నారని అన్నారు. తెగిపోయినట్లయితే ఆ భాగాలు సముద్రంలోకి కొట్టుకుపోవటం లేదా ఒడ్డుకు రావటం జరిగేవని, కానీ ఒక్కచోటే స్థిరంగా ఉన్నాయని తెలిపారు.

ఫ్లోటింగ్ బ్రిడ్జి వద్ద మాక్ డ్రిల్ నిర్వహిస్తున్నట్టు అధికారులు పెట్టిన బోర్డు

నిరుద్యోగ యువత ఆసక్తి రంగాల వివరాలు సేకరించాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : నిరుద్యోగ యువత విద్యార్హతల మేరకు వారు ఆసక్తి చూపే రంగాల్లో నైపుణ్య శిక్షణ ఇచ్చి, ఉపాధి కల్పించేందుకు అవసరమైన వివరాలు సేకరించాలని జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారిని ఆదేశించారు. ఇందుకు నిర్ణీత పట్టికను సంబంధిత అధికారులకు అందజేయాలని అన్నారు. జిల్లాలోని నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చి, ఉపాధి కల్పించే నేపథ్యంలో ప్రాథమిక సమావేశం జెసి అధ్యక్షతన మంగళవారం ఆయన ఛాంబరులో జరిగింది. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ నియోజకవర్గ స్థాయిలో నిరుద్యోగ యువతను గుర్తించి, వారి విద్యార్హతలకు తగిన ఉపాధి కల్పించేలా నైపుణ్య శిక్షణను ఇవ్వాలని అన్నారు. అందుకు యువత ఆసక్తి చూపే రంగాలు, పనిచేయ బోయే ప్రాంతాలపై వివరాలను సేకరించాలన్నారు. దీనిపై యువతకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని తెలిపారు. తొలుతగా గాజువాక నియోజకవర్గ పరిధిలోని నిరుద్యోగ యువత వివరాలను సేకరించాలని, ఆ తదుపరి ఆయా అధికారులు చేపట్టవలసిన చర్యలపై ఆదేశాలు జారీ చేయడం జరుగుతుందని వివరించారు. ఈ ప్రక్రియను రానున్న రెండు వారాల్లో పూర్తిచేయాలని స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సాయికష్ణ చైతన్య, జిల్లా పరిశ్రమల కేంద్రం జిల్లా మేనేజర్ సిహెచ్.గణపతి, సెట్విస్ సిఇఒ డి.కీర్తి, నేక్ సహాయ సంచాలకులు రవి కుమార్ పాల్గొన్నారు.

బెదిరింపు కాల్స్‌పై సిపికి ఫిర్యాదు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : చంపేస్తామని, నరికేస్తామని తనకు శని, ఆదివారాల్లో రాత్రి 8 నుంచి 11 మధ్య ఐదు వరకు ఫోన్ నెంబర్ల నుండి బెదిరింపు కాల్స్ వచ్చాయని, ఈ కాల్స్ చేసిన వారు ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన వారు కాదని టిడిపి తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు తెలిపారు. తనకు వచ్చిన ఫోన్ కాల్స్‌పై దర్యాప్తు జరిపి అందుకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం సాయంత్రం నగర పోలీసు కమిషనర్‌కు ఆయన ఫిర్యాదు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఈ కుట్రలో అధికార వైసిపి ప్రభుత్వం పాత్ర ఉందని అర్థమవుతోందన్నారు. జగన్మోహన్ రెడ్డి పాలనలో ప్రజా ప్రతినిధుల కుటుంబాలకే రక్షణ లేదన్నారు.

నూతన తహశీల్దార్‌కు సత్కారం

హుకుంపేట : స్థానిక మండల తహశీల్దార్‌గా మంగళవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన బి.రవికుమార్ మంగళవారం రెవెన్యూ సిబ్బంది పుష్పగుచ్ఛంతో స్వాగతించి దుశ్శాలువాతో సత్కరించారు. ఇక్కడ తహశీల్దార్ రాజ్యలక్ష్మి బదిలీతో ఖాళీ అయిన స్థానంలో నర్సీపట్నం నుంచి రవికుమార్ బదిలీపై వచ్చారు. కార్యక్రమంలో డిటి సిహెచ్.కృష్ణారావు, సీనియర్ అసిస్టెంట్ మోహనరావు, ఆర్ఐ సీతమ్మ, విఆర్ఒ కొండబాబు పాల్గొన్నారు.

క్రీడల్లో సీతగుంట విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- పెదబయలు: నెహ్రూ యువ కేంద్ర, విశాఖపట్నం ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన వివిధ పోటీల్లో సీతగుంట విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. బాలికల ఖోఖో పోటీల్లో సీతగుంట బాలికల పాఠశాల విద్యార్థినులు, వాలీబాల్ పోటీల్లో సీతగుంట -2 పాఠశాల బాలురు విజేతలుగా నిలిచారని హెచ్‌ఎం టి.నాగేశ్వరరావు, ప్రభుత్వ గిరిజన పాఠశాల హెచ్‌ఎం మూర్తి, వ్యాయామ ఉపాధ్యాయులు ఉంబిరి సాధూరాం, బోండా కోటేశ్వరరావు తెలిపారు. విజేతలను అభినందించారు.

కించుమండలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి -డుంబ్రిగుడ: మండలంలోని కించమండ పంచాయతీ కేంద్రంలో మంగళవారం సర్పంచ్ హెచ్‌బి చెల్లమ్మ పర్యవేక్షణలో పారిశుధ్య పనులు చేపట్టారు. గ్రామంలోని ప్రధాన రోడ్డు కిరువైపులా మురుగుకాలువల్లోని చెత్తాచెదారాన్ని తొలగించారు. ఈ సందర్భంగా సర్పంచ్ చెల్లమ్మ మాట్లాడుతూ అపారిశుధ్యంతో దోమలు విజృంభించి ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో పారిశుధ్య పనులు చేపట్టామన్నారు. ప్రతి ఒక్కరూ పరిశుభ్రతకు ప్రాధాన్యతనివ్వాలన్నారు.

సుస్థిరమైన భవిష్యత్తుకు శాస్త్ర విజ్ఞానం అవసరం

ప్రజాశక్తి-విశాఖపట్నం : సుస్థిరమైన భవిష్యత్తుకు శాస్త్ర విజ్ఞానం దోహదపడుతుందని ఏయూ వీసీ ఆచార్య పివిజిడి ప్రసాదరెడ్డి అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏయూలో నిర్వహించిన పలు కార్యక్రమాలలో ఆయన పాల్గొన్నారు. ముందుగా సివి రామన్ విగ్రహానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. అనంతరం విద్యార్థుల ర్యాలీని పరిపాలనా భవనం వద్ద జెండా ఊపి ప్రారంభించారు. విద్యార్థులు ప్లకార్డులు పట్టుకుని సైన్స్ ప్రాముఖ్యతను వివరిస్తూ ర్యాలీగా ఏయూ మీదుగా బీచ్‌రోడ్డులోని కన్వెన్షన్ సెంటర్ వరకు తరలివెళ్లారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో విద్యార్థులనుద్దేశించి వీసీ ప్రసాదరెడ్డి ప్రసంగించారు. యువత నిరంతర అభ్యాసకులుగా మారాల్సిన అవసరం ఉందన్నారు. యంత్ర ఆధారిత ఆర్థిక వ్యవస్థగా నేడు ప్రపంచం మార్పు చెందుతోందని, దీనికి అనుగుణంగా యువతను సన్నద్ధం చేయాల్సిన అవసరం ఉందన్నారు. సునిశిత పరిశీలన, అవగాహన, ఆచరణ లక్షణాలను పెంపొందించుకోవాలని సూచించారు. సామర్థ్యాలను నిరంతరం పెంపొందించుకోవాలన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ మాట్లాడుతూ, మీ వైఖరులే భవిష్యత్తు ప్రగతిని నిర్దేశిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య కె.శ్రీనివాస రావు, అసిస్టెంట్ ప్రిన్సిపల్స్ అనూరాధ కామేశ్వరి, సంధ్య దీపిక, పాలక మండలి సభ్యులు ఆచార్య పి.సునీత తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీరామ చంద్రమ్మ పండగ

ప్రజాశక్తి - పరవాడ : మండలంలోని వాడచీపురుపల్లి, దలాయిపాలెం 14 పరిసర గ్రామాలలో శ్రీరామచంద్రమ్మ అమ్మవారి పండుగ అనుపోత్సవం మంగళవారం ఆయా గ్రామాలలో ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున నుండి అమ్మవారి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారిని పురవీదులలో మేళ తాళాలు, బాజా, బజంత్రీలుతో ఊరేగింపు చేశారు. వాడచీపురుపలిలో మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు సునీత దంపతులు, మండల టిడిపి అధ్యక్షులు వియ్యపు చిన్నా దంపతులు, వైజాగ్ జర్నలిస్టులు ఫోరమ్ అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు కుటుంబ సభ్యులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఒకే ఈతలో నాలుగు మేక పిల్లలు

ప్రజాశక్తి - బుచ్చయ్యపేట : బుచ్చయ్యపేట గ్రామ శివారు నేతవానిపాలెం గ్రామంలో బర్నికాన చిన్నకు చెందిన మేక ఒకే ఈతలో నాలుగు పిల్లలకు జన్మనిచ్చింది. సోమవారం రాత్రి రెండు పిల్లలకు జన్మనివ్వగా, గంట వ్యవధిలో ఒకపిల్ల, మరో గంట వ్యవధిలో మరో పిల్లకు జన్మనిచ్చింది. సాధారణంగా మేకలకు ఒకటి, రెండు పిల్లలు పుడతాయి. కొన్నింటికి మూడు పిల్లలు పుడగాయి. కానీ ఒకే ఈతలో నాలుగు మేక పుట్టడం అరుదుగా ఉంటుంది. నాలుగు మేకపిల్లలు ఆడపిల్లలే కావడం విశేషం. తల్లి మేక, పిల్లలు ఆరోగ్యంగా ఉన్నాయని చిన్న తెలిపారు.

వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న భరత్ కుమార్

ప్రజాశక్తి -కశింకోట : వైసిపి అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్ కుమార్ ద్వారకా తిరుమలలో వెంకటేశ్వర స్వామిని మంగళవారం దర్శించుకున్నారు. ఆయనకు ముందుగా ఆలయ కమిటీ సభ్యులు స్వాగతం పలికి, సత్కరించి షీల్డ్ బహుకరించారు. ఆయన వెంట ఉగ్గినిపాలెం సర్పంచ్ కలగా గున్నయ్య నాయుడు, వైసిపి మండల అధ్యక్షుడు మలసాల కిషోర్, మలసాల కుమార్ రాజా ఉన్నారు.

ఆక్రమణ లేఅవుట్లపై విచారణ జరిపించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : మండలంలోని సంపత్ పురంలో జగనన్న కాలనీలో ఇల్లు స్థలాల అమ్మకాలపై సరైన విచారణ జరిపించాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆక్రమణకు గురైన లేఅవుట్లను పరిశీలించారు. అధికార పార్టీ నాయకులమని చెప్పుకుంటూ ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసి అమ్మకాలు జరుపుతున్నవారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు వియ్యపురాజు, నరాలశెట్టి సత్యనారాయణ, మత్తూర్తి సూరిబాబు, బర్నికాన సాయి, ఒమ్మి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డు టీచర్‌కు సత్కారం

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: ఉద్యోగ విరమణ చేసిన మండలంలోని సాగర పంచాయతీ అడపవలస జిపిఎస్ పాఠశాల ఉపాధ్యాయుడు బస్కి బారికి లల్లు దంపతులను మంగళవారం గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఘనంగా సన్మానించారు. ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు టి సూర్యనారాయణ, గ్రామస్తులు పాపరావు, రమేష్, నూకరాజు పాల్గొన్నారు.